క్లుప్తంగా

ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం ఈనెల 3వ తేదీ శుక్రవారం రద్దు చేస్తున్నట్లు పోలీసు ఉన్నత అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా కేంద్రంలో పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్న కారణంగా ఎస్పీ హాజరు కాలేకపోతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

నందిగాం: మండలంలోని మదనాపురం సబ్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మదనాపురం, అన్నాపురం, దిమ్మడిజోల, దీనబంధుపురం, హర్షబడ, రధజన బొడ్డపాడు, కల్లాడ, కైజోల, నౌగాం తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆక్రమిస్తే చర్యలు తప్పవు



షాపు యజమానులతో మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి రూరల్: స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ నుంచి పాత జాతీయ రహదారి పక్కగా ఉన్న షాపు యజమానులు రోడ్డును ఆక్రమించి, వాహన రాకపోకలకు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని టెక్కలి సీఐ విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక భవానీనగర్ సమీపంలో ఉన్న దుకాణ యజమానులతో గురువారం మాట్లాడారు. షాపులు కాలువ దాటి రోడ్డు మీదకు రాకూడదని స్పష్టం చేశారు.

4న బయాలజీ టాలెంట్ టెస్ట్

కవిటి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవరి 4వ తేదీన బయాలజీ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం బెందాళం మల్లేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ పాఠశాల స్థాయిలో గెలుపొందిన 8, 9, 10వ తరగతి విద్యార్థులు ముగ్గురు కలిసి ఒక టీమ్‌గా పాల్గొనాలని జీవశాస్త్ర ఫోరం మండల కన్వీనర్ యు.గిరిబాబు తెలియజేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే గౌతు శిరీష గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహన్‌రావు, పాఠశాల హెచ్‌ఎం జనార్ధన తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగకు జిప్సం తప్పనిసరి



రైతులకు సూచనలు చేస్తున్న ఏవో శ్రీకాంత్‌వర్మ

నందిగాం: వేరుశనగ పంటకు తప్పనిసరిగా జిప్సం వేయాలని మండల వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్ వర్మ సూచించారు. మండలంలోని కాపు తెంబూరు, పాలవలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. రబీలో వేరుశనగ పంటకు ఎకరాకు 200 కేజీల జిప్సం వేస్తే దిగుబడి అధికంగా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బోకర సన్యాసిరావు, తుంగాన శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

విరిగిన రైల్వేగేటు



విరిగిన దండుగోపాలపురం రైల్వేగేటు

సంతబొమ్మాళి: మండలంలోని దండుగోపాలపురం రైల్వే గేటు గురువారం విరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. సుమారు 3 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎంతసేపటికీ గేటుకు మరమ్మతులు చేయకపోవడంతో ఇరువైపులా ఉన్న వాహనదారులు టెక్కలి మీదుగా తమ గమ్యస్థానాలకు అతి కష్టం మీద చేరుకున్నారు. రాత్రిపూట కావడం, చలి తీవ్రత అధికంగా ఉండడంతో చిన్నారులు, వృద్ధులకు తీవ్ర ఇబ్బంది ఎదురైంది.



కాశీబుగ్గలో మేడపైన ఉన్న మున్సిపల్ గ్రంథాలయం



అలంకరణగానే మిగిలిన పాత పుస్తకాలు

సమస్యల కేంద్రం.. ఈ గ్రంథాలయం..!

- రెండో అంతస్తులో ఉండడంతో ఇబ్బందులు
- కొన్ని పత్రికలే వస్తున్న వైనం
- పోటీ పరీక్షల పుస్తకాలు కరువు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ గ్రంథాలయంలో సమస్యలు తిష్ఠ వేశాయి. ఈ గ్రంథాలయం ముఖ్యంగా రెండో అంతస్తులో ఉండడంతో వృద్ధులు, వికలాంగులకు అందనంత ఎత్తుగా మారింది. మరోవైపు మౌలిక సదుపాయాలు లేకపోవడంతో సాధారణ ప్రజలు సైతం వెళ్లేందుకు ఆసక్తి చూపించడం లేదు. మొత్తం 31 వార్డులకు చెందిన సుమారు 75 వేల మంది పన్నులతో ఈ గ్రంథాలయం నడుస్తోంది. 14వ వార్డు పరిధిలో ఉన్నటువంటి బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ కాంప్లెక్సు రెండో అంతస్తులో గ్రంథాలయం ఉంది. అయితే నూతనంగా వచ్చే పుస్తకాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్స్ లేకపోవడంతో ఎవరూ వెళ్లక బోసిపోతోంది.



చిందరవందరగా ఉన్న దృశ్యం

ప్రధాన సమస్యలు

- రెండో అంతస్తులో ఉండడంతో వయో వృద్ధులు, వికలాంగులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది అయితే వెళ్లడమే మానేశారు.
- గ్రంథాలయం ఎప్పుడూ దుమ్ము ధూళితో నిండి ఉంటుంది. పాడైపోయిన మెట్లమార్గంతో దర్శనమిస్తుంది.
- గ్రంథాలయానికి ఆంగ్ల పత్రికలు వేయడం లేదు.
- కేవలం ఐదు దినపత్రికలు తప్పితే వార పత్రికలు, మాస పత్రికలు, పక్ష పత్రికలు, త్రైమాసిక పత్రికలు, వార్షిక పత్రికల జాడ కనిపించదు.
- అన్ని రకాల పత్రికలు రాకపోయినా వచ్చినట్లు నెలవారీ బిల్లులు, వార్షిక బిల్లులు రూ.లక్షల్లో పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- వాస్తవానికి గ్రంథాలయానికి సంబంధించిన కోర్సులు, పట్టాలు పొందినవారికి గ్రంథాలయంలో ఉద్యోగం ఇవ్వాలి. కానీ అలా కాకుండా పదో తరగతి చదువుతున్నటువంటి వారికి ఉద్యోగం కల్పించి పాఠకులకు గ్రంథాలయాన్ని దూరం చేస్తున్నారు.
- పాత బెంచీలు, పాడైపోయిన కుర్చీలు, గాలులకు పగిలిపోయిన కిటికీలతో కాలం వెళ్లదీస్తున్నారు.
- పోటీ పరీక్షలకు సంబంధించిన ఒక్క అప్‌డేట్ పుస్తకాలు కూడా ఉండవు.
- పాఠకులు ఎవరూ రాకపోవడంతో రెండు మూడు రకాల పెన్నులతో అక్కడ పనిచేస్తున్నవారే సంతకాలు చేసి గ్రంథాలయాన్ని నడుపుతున్నారు.
- ఉదయం 8 గంటలకు తెరవాలి కానీ ఒక్కోసారి తొమ్మిది అవుతుంది. సాయంత్రం గంట ముందే మూసేస్తుంటారు.

ప్రక్షాళన చేస్తాం



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి గ్రంథాలయం ప్రజలంతా కడుతున్న పన్నులతో నడుపుతున్నాం. ఇటీవల కాలంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కొంతమంది సభ్యులు వీటి సేవలపై ప్రస్తావించారు. గ్రంథాలయాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి అన్ని పత్రికలు వచ్చేలా చూస్తాం. ప్రజలకు అవసరమయ్యే అన్ని రకాల పుస్తకాలు సమకూరుస్తాం. పోటీ పరీక్షలకు చదువుతున్న విద్యార్థుల అభిప్రాయం మేరకు విలువైన పుస్తకాలు తీసుకొస్తాం. మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.

– నడిపేన రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

భూ సమస్యలకు తక్షణమే పరిష్కారం



పలాస: నీలిభద్రలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పలాస: మండలంలోని భూములకు సంబంధించిన సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపిస్తామని తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి అన్నారు. నీలిభద్ర గ్రామంలో రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. అలాగే ప్రజలకు అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలిభద్ర గ్రామాన్ని పైలెట్ గ్రామంగా తీసుకున్నామన్నారు. పలాస మండలంలో చాలా గ్రామాల్లో సమస్యలు ఉన్నాయని, వాటిని 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వాయిలపల్లి సునంద, మండల సర్వేయర్ చంద్రశేఖర్, ఆర్‌ఐ ఖగేశ్వర్‌రావు, గిరి తదితరులు పాల్గొన్నారు.



కంచిలి: వినతులు స్వీకరిస్తున్న జెడ్పీటీసీ లోలాక్షి

కంచిలి: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి కోరారు. మండలంలోని డోలోగోవిందపురం గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో నెలకొన్న భూ సమస్యలపై స్థానిక రైతులు అందించిన వినతులను వెంటనే పరిష్కరించాల్సిందిగా తహసీల్దార్ ఎస్.రమేష్‌నాయుడు ఆదేశించారు. సమావేశంలో సర్పంచ్ హృషికేష్ పాత్రో, సర్వేయర్ చలపతిరావు, వీఆర్వో చూడామణి రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సైనికులకు ఘన స్వాగతం



సైనికులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

కాశీబుగ్గ: మందస మండలం అచ్చుతాపురం గ్రామానికి చెందిన ఇద్దరు సైనికులు గొల్లపల్లి వెంకట్రావు, గొల్లపల్లి శ్రీధర్, మెళియాపుట్టి మండలం చొంపాపురం గ్రామానికి చెందిన అప్పలస్వాములకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ముగ్గురు సైనికులు ఒకేసారి పదవీ విరమణ చేసి తమ గ్రామాలకు వస్తున్న సందర్భంగా పలాస రైల్వేస్టేషన్‌లో గురువారం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు ఘన స్వాగతం పలికారు. ఆ ప్రాంతమంతా జై జవాన్ నినాదాలతో హోరెత్తింది.

పక్కాగా పుస్తక నిర్వహణ



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కంచిలి: స్వయంశక్తి సంఘాలు పుస్తక నిర్వహణ పక్కాగా చేపట్టాలని ఐకేపీ ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. మండలంలోని బూరగాం గ్రామ సంఘం–2 పరిధిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సహకార చట్టం 1995 నిబంధన ప్రకారం ప్రతీ సంఘం ప్రతీ సంవత్సరం సభ్యత్వం, వాటాధనం చెల్లించాలని, గ్రామ సంఘానికి పొదుపులు చెల్లించాల్సి ఉందని సభ్యులందరికీ అవగాహన కల్పించారు. సమావేశంలో సీసీ బి.పాపారావు, వీవోఏ హైమావతి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సంతబొమ్మాళి: ఈనెల 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్ మండల విద్యాశాఖాధికారులు జె.చిన్నవాడు, డి.అర్జునుడు చేతులమీదుగా గురువారం ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ డి.గణపతిరావు మాట్లాడుతూ రాష్ట్ర స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలం యూటీఎఫ్ కోశాధికారి సింహాచలం, సహాధ్యక్షుడు పాల్గుణరావు, రామకృష్ణ, రామారావు, కామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు

పాఠశాలల పనితీరు పర్యవేక్షించాలి

కంచిలి: పాఠశాలల పనితీరును స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు పర్యవేక్షించాలని ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు సూచించారు. మండలంలోని మఠం సరియాపల్లి ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో ఎస్‌ఎంసీ చైర్మన్లు, పాఠశాలల హెచ్‌ఎంలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సమావేశంలో సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీలదే కీలకపాత్ర

కవిటి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులతో పాటు ఎస్‌ఎంసీలదే కీలకపాత్ర అని ఎంఈవోలు ధనంజయ మజ్జి, కె.చిట్టిబాబులు అన్నారు. మండల కేంద్రంలో హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్లకు మండల స్థాయిలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా కమిటీ సభ్యుల విధులు, బాధ్యతలు తెలియజేశారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి నిధుల వినియోగంలో పారదర్శకతపై నిరంతర పర్యవేక్షణ జరపాలన్నారు. మధ్యాహ్న భోజన అమలు, పరిశీలన, వివరాల సేకరణ, నిధుల వినియోగం, బాలల రక్షణ, సోషల్ ఆడిట్, మౌలిక వసతులు సమకూర్చడంలో ప్రధానపాత్ర పోషించాలని సూచించారు. పాఠశాల ప్రగతికి, విద్య హక్కు చట్టం అమలుకు, బాలల హక్కుల పరిరక్షణకు ఏర్పాటు చేయబడిన చట్టబద్ధ వ్యవస్థ పాఠశాల కమిటీ అని వివరించారు. శిక్షణ కార్యక్రమానికి త్రిలోచన బిసాయి, సీతంనాయుడు, మనోజ్, భారతిలు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు.



సోంపేట: మాట్లాడుతున్న ఎంఈవో జోరాడు



నందిగాం: మాట్లాడుతున్న ఎంఈవో నర్సింహులు

ఎస్‌ఎంసీ చైర్మన్లకు శిక్షణ

నందిగాం: పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లకు, హెచ్‌ఎంలకు పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల మెరుగు కోసం గురువారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో–1, 2లు నర్సింహులు, చిన్నారావులు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో చైర్మన్లు భాగస్వామ్యులు కావాలని, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్పీలు జెన్ని విశాఖరావు, కుమారస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేయాలి

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పాఠశాలల యాజమాన్య కమిటీలు కృషి చేయాలని విద్యాశాఖాధికారి ఎస్.జోరాడు అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో యాజమాన్య కమిటీల చైర్మన్లు, పాఠశాలల హెచ్‌ఎంకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లు బెహరా వేణుగోపాల్, రమేష్ కుమార్ పాణిగ్రాహి, దాలిబందు పాల్గొన్నారు.



కవిటి: మాట్లాడుతున్న ఎంఈవో ధనంజయ మజ్జి



కంచిలి: సూచనలిస్తున్న అధికారులు

దరఖాస్తుల ఆహ్వానం

నందిగాం: మండలంలో నూతనంగా మంజూరైన బైరిబొడ్డపాడు, కందులగూడేం, నవరనీలాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సహాయకులకు 7వ తరగతి చదివిన స్థానిక, వివాహిత గిరిజన మహిళలు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 3వ తేదీ నుంచి 10వ తేదీలోగా టెక్కలి ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పలాస: మండలంలోని కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలో మూడు అంగన్‌వాడీ సహాయక కార్యకర్తల ఉద్యోగాల కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీవో పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తరింగ్ తాళభద్ర, పెద్దపల్లియా, సిరిపురం గ్రామాల్లో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. దీనికి ఎస్టీ మహిళా అభ్యర్థులు ఈనెల 3 నుంచి 10వ తేదీలోగా దరఖాస్తులు తమ కార్యాలయానికి అందజేయాలని సూచించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాజ్యోతి వెలిగిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

కవిటి: క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందని ప్రభుత్వ విప్ డా.బి.అశోక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల మైదానంలో హెచ్‌ఎం బి.మల్లేశ్వరరావు పర్యవేక్షణలో నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ పోటీలు గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.మురళీమోహనరావు, ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీల బాధ్యులు తవిటినాయుడు, హరిబాబు, జోన్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఇచ్ఛాపురం రూరల్: క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) క్యాలెండర్, డైరీ, పాకెట్ క్యాలెండర్లను మండల విద్యాశాఖాధికారులు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథంలు గురువారం ఆవిష్కరించారు. మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వీటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సోంపేట: జాగృతి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

సోంపేట: మండలంలోని కొర్లాం జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ 2025 వార్షిక క్యాలెండర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం ఆవిష్కరించారు. గత 16 సంవత్సరాలుగా సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి ఉన్నారు.

వినూత్నం



సాధారణంగా పంట రక్షణ కోసం ముళ్ల కంచె ఏర్పాటు చేస్తారు. కానీ వేరుశనగ పంటలకు మాత్రం ముళ్ల కంచె బదులుగా మహిళలు ధరించిన చీరలు తీసుకొచ్చి పొలం చుట్టూ ఇలా కంచెగా ఏర్పాటు చేశారు. ఈ చీరలు ఏర్పాటు చేస్తే పిచ్చుకలు, కాకులు, ఇతర జంతువుల పంటలోకి రాకుండా ఉంటాయని రైతులు తెలిపారు. కోటబొమ్మాళి మండలంలో ఇలా విరివిగా ఏర్పాటు చేశారు. – టెక్కలి

స్పందించరా..?



ఈ చిత్రంలో కనిపిస్తున్న విద్యుత్ స్తంభాలు కేవలం వైర్ల మీదే నిలబడి ఉన్నాయంటే నిజం ఒప్పుకోక తప్పదు. అనుకోని ప్రమాదం జరిగితేనే విద్యుత్ అధికారులు స్పందిస్తారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏడాది క్రితం బేడ్డేపుపేట రోడ్డు నుంచి బాలకృష్ణాపురానికి వెళ్లే ఈ రహదారిలో తారురోడ్డు వేశారు. ఆ సమయంలో విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగిపోయాయి. 11కేవీ విద్యుత్ లైన్ కావడంతో భయంతో స్థానికులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదు. దీంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – ఇచ్ఛాపురం రూరల్

అయ్యప్పస్వామి తిరువీధి



అయ్యప్పస్వామి మండల దీక్షలు చేస్తున్న స్వాముల ఆధ్వర్యంలో గురువారం అయ్యప్పస్వామి తిరువీధుల కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కేరళ సాంప్రదాయంలో అయ్యప్పదీక్షలు చేపట్టిన స్వాములు అయ్యప్పస్వామిని తిరువీధుల్లో ఊరేగించడం ప్రత్యేక కార్యక్రమంగా నిర్వహించినట్లు గురుస్వామి బడే రామారావు తెలిపారు. ప్రగడపుట్టుగ రోడ్డులో ఉన్న సన్నిధానం నుంచి కవిటి పట్టణ వీధుల్లో సాగిన ఈ తిరువీధి స్థానిక చింతామణి అమ్మవారి ఆలయం వరకు కొనసాగి, మరలా సన్నిధానం వరకు సాగింది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. – కవిటి

మంచు దుప్పటి



ఇచ్ఛాపురం పట్టణాన్ని గురువారం మంచు దుప్పటి కప్పేసింది. దాదాపు ఉదయం 10 గంటల వరకు దట్టంగా మంచు కురవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అనంతరం సూర్యరశ్మి రావడంతో కొంత సమయానికి మంచు ప్రభావం తగ్గుముఖం పట్టింది. – ఇచ్ఛాపురం

5న సిక్కోలు డ్వాక్రా బజార్

ఇచ్ఛాపురం రూరల్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్, ఏడు రోడ్ల జంక్షన్ వద్ద ఈనెల 5వ తేదీన సిక్కోలు డ్వాక్రా బజార్ నిర్వహిస్తున్నామని సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత వస్త్రాలు, డ్వాక్రా సంఘ మహిళలతో తయారు చేయబడిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం జరుగుతుందన్నారు.